# నూటికో కోటికో ఒక్కరు

## కన్నెపల్లి గోపాలకృష్ణ



వామనరావుకేసి ఓరకంట చూసాను.

తనమీద వినవస్తున్న కామెంట్లను విననట్లే ఫైలులో ఏదో వ్రాసుకుపోతున్నాడు

అతన్ని చూస్తుంటే ఒక్క క్షణం వీధినపోయే గజరాజు గుర్తొచ్చింది.

అంతేకాదు. ముఖమ్మీద ఉమ్మిన అతి సాధారణంగా తుడిచేసుకునే సిగ్గూ లజ్జా లేని వ్యక్తి కూడా గుర్తొచ్చాడు.

ఛ. ఏం మనిషి ?

వాళ్ళమీద, వీళ్ళమీదా పెట్టి తనకేసి చూస్తూ హేళనగా అంటున్నా పట్టించుకోకుండా నిర్వికారంగా ఉంటాడేం ?

చెప్పు తీసి, ముఖమ్మీద కొట్టినట్లు సమాధానం చెప్తే పోలా ?

మొరిగే కుక్కల్లా టేబిల్ చుట్టూ చేరి వాగుతున్న సుబ్బారావు బృందాన్ని చూస్తుంటే అసహ్యమేసింది

ఒక మనిషిని అదేపనిగా మాటల్తో బాధించడానికి వీళ్ళకి మనసెలా ఒప్పుతుందో ?

ఎవరి అలవాట్లు వారివి. అతని వ్యక్తిగత విషయాలను విమర్శించడానికి వీళ్ళకెవరిచ్చారు హక్కు ?

ఫైలుమీద పెన్ను సాగిపోతున్నా నా చెవులు మాత్రం అసంకల్పితంగానే వాళ్ళ మాటలు వింటున్నాయి.

"చూడండి గుర్నాథంగారూ. మీరెంత పిసినార్లైతే మాత్రం పిల్లలకి కూడా కడుపునిండా తిండి పెట్టకపోతే ఎలాగండీ ? సామ్మేం కట్టుకపోతారా మీరు ? మీరేమనుకోనంటే నాదో చిన్న డౌటు. కట్టుకున్న దానిక్కూడా సరైన చీర కొనకపోతే ఎలాగండీ ? ఏమండోయ్ వింటున్నారా? — మిమ్మల్నే డబ్బు దేముందండీ ? ఆఫ్టాల్. వెధవ డబ్బు. డబ్బుని మనం సంపాదిస్తాం కానీ డబ్బు మనల్ని సంపాదించదుగదండీ..." అనర్గళంగా సాగిపోతోంది సుబ్బారావు వాక్ప్రవాహం.

ఆ మాటలన్నీ నిజంగా తననే ఉద్దేశించి అంటుంటే గుర్నాథం అంత హాయిగా నవ్వగలడా ?

వామనరావు విని బాధపడాలనే కాదూ వాళ్ళ ఉద్దేశం

సంస్కారంలేని మనుషులు

చేద్దామనుకుంటున్న పనికి ఏకాగ్రత కుదిరి చావడం లేదు

వీళ్ళ మాటలు డిస్టర్బెన్స్ కలిగిస్తున్నాయి.

విసుగ్గా చూసాను

నా చూపును ఆ పట్టున క్యాచ్ చేసేసాడు సుబ్బారావు.

"హల్లో, గురువుగారూ ! ఏంటీ—కథకు ప్లాటు వెతుకుతున్నట్లుందే వాలకం ? అయినా లంచ్ అవర్ టైములో కూడా ఏమిటండీ పని ? క్యాంటీనుకి రారూ ? కొంపదీసి మీరు కూడా మన గుర్నాథంలానే ఆదా చేయడం నేరుస్తున్నారేమిటి ?" వెకిలిగా నవ్వుతూ చొరవగా నా భుజం పట్టుకు నిలబెట్టాడు సుబ్బారావు.

అయిష్టంగానే లేచి, అనుసరించాను

చెయ్యాల్సిన పని కొండంత ఉంది. చకచకా చేసేద్దామనుకుంటే వెధవ బోర్‌గాళ్ళు తయారయ్యారు తిట్టుకుంటూ క్యాంటిన్‌లో ప్రవేశించాను.

టోకెన్లు తీసుకొని ఫలహారాలు పట్టుకొని కుర్చీల్లో కూలబడ్డాం

నా ఎదురుగా కుర్చీలో సుబ్బారావు

ప్లేటులో పూరీ ముక్కలుగా త్రుంచి తినసాగాను.

సుబ్బారావు ఓ ముక్కను తుంచి నోట్లోవేసుకు నములుతూ కూడా వాగడం మానలేదు.

వెధవ కనీస జ్ఞానంలేదు అతని నోటి తుప్పరలు నా చొక్కాను తడిపేస్తున్నాయని గుర్తించడేం ?

ఇతని కంపెనీలో టిఫెన్ చేయడం దుర్లభం.

పూరీ ప్లేటుని మవునంగా అవతలకు నెట్టేసి, మంచినీరు త్రాగాను.

"అరే, అదేంటి గురూగారూ ! ఒక్క పూరీ కూడా పూర్తిగా తినలేదు మీరు అలా వదిలేసిన రెండోదాన్నే మళ్ళీ వడ్డించెయ్యగలరు వీళ్ళు" మందలిస్తున్నట్లు అని అంతలోనే నవ్వేసి, నా ప్లేటులో రెండో పూరిని తన ప్లేటులో వేసుకున్నాడు సుబ్బారావు.

"కొంపదీసి రవ్వదోసె కూడా తినరా ఏం ? ఆకల్లేకుండా ఎందుకొచ్చారసలు ? మనీ వేస్టు కాదూ ? సరేన్లెండి. మీరు తినకపోతే వట్టినే వదిలేస్తామా ఏం ? మేమంతా లేమూ !" సర్వర్ నా కోసం తెచ్చిన దోసె ప్లేటుని తనవైపు జరుపుకొంటూ ఆబగా తినసాగాడు.

నేను చూస్తుండగానే రెండు దోసెలూ గుటుక్కున మింగి, గ్లాసునీళ్ళతో గొంతు తడుపుకొని, కంఠం సవరించుకున్నాడు

"చూడండి సార్. అక్కడే ఉంది మనకీ, ఆ వామనరావు గాడిదకీ తేడా! మీరు ఆకలిలేకపోయినా కంపెనీ కోసం నేను పిలిచిందే తడవుగా వచ్చేసారు కదూ ! వాడో . కడుపులో ఆకలి కరకరమంటున్నా జేబులో డబ్బులు ఎక్కడ అయిపోతాయోనని క్యాంటీనుకి రాడు. అక్కడికీ నేనెన్నోసార్లు ఆఫర్ చేశాను. నువ్వేం ఖర్చు పెట్టనక్కరలేదయ్యా. నేనే ఇప్పిస్తా అని. నేనీసారి ఇప్పిస్తే తను మరోసారి ఇప్పించాలిగా. అందుకని వద్దనేస్తుంటాడు పిసినారి వెధవ."

రహస్యం చెపుతున్నట్లు కొద్దిగా ముందుకు వంగాడు.

"మీరు జాయినై నాల్రోజులు కూడా కాలేదు కాబట్టి మీకు తెలియదు — ఆ వామనరావు ఎంత పిసినారి వెధవో ! బజార్లో కూరగాయలు కొనరట. ఇంట్లో ఉన్న గుప్పెడు స్థలంలోనే డిగ్నిటీ, పాడూ లేకుండా కూరగాయల మొక్కలు వేసుకున్నారట. చూడండి. మా ఇంట్లోనూ పెరడుంది. చక్కగా పూలమొక్కలు వేసింది మా ఆవిడ. కూరల దేముందండీ. మార్కెట్లో దొరకవూ? ఆ బుద్ధులే వేరండీ."

అతను కూరగాయలు కొంటేనేం ? కొనకపోతేనే ? ఇంట్లో పండించుకోవడం నేరమా ? మార్కెట్లో కొనుక్కోవడమే గొప్ప విషయమా ? మధ్యతరగతి అతిశయానికి నవ్వు వచ్చింది.

టోకెన్లు తీసుకుపోయి ట్రేలో పొగలు కక్కుతున్న టీలు తెచ్చాడు గుర్నాథం

"గుడ్ బాయ్. అభివృద్ధిలోకి వస్తావు" దీవెన పారేసి, నాకేసి తిరిగాడు సుబ్బారావు.

"మన ఆఫీసు మొత్తమ్మీద గుర్నాథం లాటి మనిషి లేడనుకోండి. చిన్నవాడైనా పెద్దల ఎడ ఎంత వినయమూ, విధేయతా! అన్నట్టు ఇందాక ఇతన్ని గురించి అన్నాననుకున్నారేమిటి ? మన జిడ్డుగాడు లేడూ! వాడ్ని ఉద్దేశించి అంటున్నా ! మనం ఇలా అంటున్నట్లు తెలుసా గురుడికి, అయినా పట్టించుకోడే ? అబ్బబ్బే ! బొత్తిగా చీమూ నెత్తురూ లేదండీ" తాపీగా తన అభిప్రాయాలు చెపుతున్నాడు.

నాకు సహనం పూర్తిగా అంతరించింది. వారం రోజుల్లో ఇనెస్పెక్షనని తెలిసినా ఎంత నిబ్బరం ?

వెళ్ళడానికి ఉద్యుక్తుడ్నై నిలబడ్డాను

"కూర్చోండి గురూగారూ ! అంత తొందరేమిటే మీకు ? ఇంకా పావుగంట వుందిగా" నా చెయ్యి పట్టుకొని కూర్చోబెట్టబోయాడు

"క్షమించండి. బోల్డు వర్కు పెండింగులో ఉంది రేపు పొద్దున్న ఇనెస్పెక్షన్‌లో మాట " వదిలించుకొని అన్నాను రెండడుగులు ముందుకేసి

"ఓసి, మీదుంపతెగ ! అదా మీ డవుటు ఇనెస్పెక్షన్ అంటే అంత భయమెందుకండీ బాబూ ? ఆ వచ్చే ఆఫీసరుకి మన ఫైల్సే చూసే ఓపికా, శ్రద్ధా కూడానా ? వాడీ విలాసాలూ, వాడి దర్జా— అంతే ! మరీ అంతగా అడిగాడనుకోండి ఓ చిన్న నవ్వు పారేసి, నాల్గుసార్లు సార్‌సార్ అని వెంట తిరిగితే గుమ్మైపోడూ గురుడూ ! వెళుతున్నప్పుడు సెండాఫ్ ఇచ్చేసి, ఓ పళ్ళబుట్ట మొహమ్మీదపడేస్తే మనమీద బ్రహ్మాండమైన రిపోర్టు వ్రాసి పడేస్తాడు. ." ఇంకా ఏదో మాట్లాడుతున్నాడు సుబ్బారావు.

అతని మాటలు సగంలో ఉండగానే గబగబా నా సెక్షనుకు వచ్చేశాను.

వామనరావు గోడకేసి కుర్చీ జరుపుకు టిఫిన్ తింటున్నాడు.

లోని కడుగిడుతున్న నన్ను చూసి, "అప్పుడే వచ్చేశారే. రండి సార్" అన్నాడు.

తప్పనిసరిగా అటు అడుగు వేశాను ఇంత వరకూ వాళ్ళదయ్యింది. ఇక ఇతగాడు వాళ్ళమీద ఎన్ని చాడీలు చెప్తాడో ?

పక్కనే కుర్చీలో కూర్చుని ఫైల్స్ తిరగెయ్యసాగాను.

"తీసుకోండి సార్" టిఫిన్ బాక్సు మూతలో రెండు ఇడ్లీలు, ఇంత కారప్పొడి, నెయ్యి వేసి నావైపు జరిపి అన్నాడు.

"అబ్బే, జస్ట్ టిఫెన్ తీసుకున్నానుగా !" మొహమాటంగా అన్నాను.

"ఫర్వాలేద్సార్ ! ఎంతని ? రెండిడ్లీలు. కొద్దిగా రుచి చూడండి" బలవంతం చేశాడు.

అట్టే మొహమాట పడడం మంచిది కాదని తినడాని కుపక్రమించాను. కారప్పొడీ, నెయ్యీ

## వధువుల కొరత !

పశ్చిమ జర్మనీలో బవేరియా రాష్ట్రం లోని రైతులకు కొత్త సమస్య వచ్చింది. అక్కడ స్త్రీల కొరత ఏర్పడింది. దాంతో అక్కడున్న ప్రతి అయిదుగురు రైతుల్లో ఒకరు బ్రహ్మచారిగానే ఉంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో పురుషుల జనాభా ఎక్కువగా ఉండటం దీనికి కారణం కావచ్చు. కానీ, అసలు సంగతి ఏమిటంటే రైతు కుటుంబాల లోని ఆడపిల్లలు కూడా రైతులను వివాహం చేసుకొనటానికి అంగీకరించటం లేదు రైతు భార్యగా తగిన ప్రాముఖ్యం లభించదనీ, అత్తగార్లు కోడళ్లను బానిసలుగా చూస్తారని అంటున్నారు. పెళ్ళి కావలసిన బ్రహ్మచారులు పెళ్ళిళ్ల పేరయ్యల వంటి మ్యారేజి బ్యూరోలకు అధిక మొత్తాలలో ముడుపులు చెల్లిస్తున్నారు. ఇదొక రకంగా దోపిడీ అంటున్నారు వీరు.

కాంబినేషన్‌తో ఇడ్లీలు చల్లారిపోయినా రుచిగా ఉన్నాయి.

అతనందించిన మంచినీళ్ళ గ్లాసందుకొంటూ అదే చెప్పాను,

"మరో నాలుగైనా తెచ్చామకాదు!" నొచ్చుకున్నాడు వామనరావు.

మా సంభాషణ జరగబోయే ఇనెస్పెక్షన్‌కి పైకి మళ్ళింది.

ఇంతలో లోనికడుగుపెట్టారు సుబ్బారావూ, బృందమూ!

"హల్లో గురూగారూ, ఇక్కడ కూర్చుండిపోయారా? వామనరావు దగ్గర పని నేర్చుకుంటున్నారా?" వ్యంగ్యంగా నవ్వుతూ దగ్గరకొచ్చాడు సుబ్బారావు.

"వామనరావుగారూ! అప్సరలో మంచి ఇంగ్లీషు పిక్చరాడుతోంది. ఈవెనింగ్ వెడదామా? ఆఫ్‌కోర్సు. ఖర్చులు నావేలెండి."

"సిన్మాలు చూడ్డం నా కలవాటులేదు సార్! అందులోనూ ఆ ఇంగ్లీషు సినిమాలు అర్థమవుతాయా? పాడా? సారీ సర్" ఫైలు తెరుస్తూ నిర్మొహమాటంగా చెప్పాడు వామనరావు

గురుడి సంగతి అర్థమయ్యింది కదూ అన్నట్టు నావైపు చూసాడు సుబ్బారావు

చూస్తుండగానే వారం రోజులు ఇట్టే గడిచిపోయాయి

ఇన్ని రోజులూ వామనరావు ఒక్క పైసా కూడా జేబులోంచి తీసి ఖర్చుచేయడం నేను చూడలేదు

"టీ, కిళ్ళీ, సిగరెట్టు ఆఖ్ఖర్లే వక్కపొడి కూడా అలవాటు లేదు గురుడికి. డబ్బు ఖర్చవుతుందని అలవాటు చేసుకోలేదు కాబోలు"

రానురానూ నాకుకూడా వామనరావుపైన అసహ్యం పెరగసాగింది.

సుబ్బారావు చెప్పినట్లు "పెళ్ళాం బిడ్డలకి కూడా సరైన తిండి పెడుతున్నాడో లేదో? పోయేటప్పుడు మూట కట్టుకుపోతాడా డబ్బు?

ఇనెస్పెక్షన్ తుఫాన్ వెలసిన సందర్భంగా ఆదివారంనాడు చిన్న పిక్నిక్కు ఏర్పాటు చేద్దామనుకున్నాం సుబ్బారావూ, నేనూ!

ఆఫీస్ స్టాఫంతా ఉత్సాహంగా ఓకే చేసింది

# మాటికో కోటికో...

ప్రోగ్రాం

యధావిధిగా వామనరావు సారీ చెప్పాడు.

నేనతన్ని ఒప్పిద్దామని ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇంట్లో ఏదో పనుందంటూ సాకులు చెప్పాడు

నాకు వామనరావుపైన అసహ్యం రెండింతలయ్యింది.

ఈ మనిషితోనా నేను మిత్రుత్వాన్ని కాంక్షించింది?

ఇతన్ని సమర్థిస్తున్నా అప్పుడప్పుడూ నేను సుబ్బారావుతో వాదించేది!

వామనరావు అభిమానాన్ని దెబ్బ తీయడానికే సంకల్పించుకొన్నాను

"మీరేం ఇవ్వనక్కరలేదు సార్! జస్ట్ ఫర్ కంపెనీ సేక్... కానీ ఖర్చవ్వదు మీకు" కావాలనే కర్కశంగా అన్నాను.

సున్నితమైన చోట దెబ్బ తగిలినట్లు విలవిలలాడేడు వామనరావు. మొహం ఎర్రనయ్యింది తమాయించుకొని చెప్పాడు

"థ్యాంక్స్ సార్. నిజంగా మీవంటి మిత్రులున్నందుకు సంతోషంగా ఉంది. అంత అవసరమైనప్పుడు తప్పక హెల్ప్ చేద్దురు గాని"

పిక్నిక్కులో మా అందరికీ వామనరావు కామన్ టాపిక్ అయ్యాడు అతని గురించి జరిగిన గోష్ఠిలో ప్రథమ పాత్ర వహించింది నేను.

* * *

ఇంకా పెళ్ళికాలేదు కాబట్టి నా స్వేచ్ఛకు సంకెళ్ళు పడలేదు నగరంలో రోజుకో వీధి కాలి నడకన సర్వే చేయడం నా సరదా! అన్ని సందులూ గొందులూ చిరపరిచితాలయ్యాయి

ఆదివారం సాయంత్రం —

అప్పుడే కురిసి వెలిసిన చిరుజల్లు పదహారేళ్ళ కన్నెపిల్లలా ఆహ్లాదాన్ని కలిగిస్తోంది కాళ్ళు దారితీసిన వీధిలోకి నడిచాను.

ఎక్కడ నుంచో ఘంటసాల పుష్పవిలాపం సన్నగా శ్రావ్యంగా వినిపిస్తోంది.

"గోపాలకృష్ణగారూ" ఎవరో చప్పట్లు చరిచి పిలుస్తున్నారు

వెనక్కి తిరిగాను ఇంటి ముంగిట నిలబడి పిలుస్తున్నాడు వామనరావు. అతనితోపాటు లోనికడుగుపెట్టాను.

డ్రాయింగు రూము కాబోలు— నాలుగు గోద్రెజ్ ఛైర్స్, ఒక మడత కుర్చీ, సోఫా కం బెడ్ ఉన్నాయి

గుమ్మాలకి పువ్వుల కర్టెన్లు వేలాడుతున్నాయి

లోపలనుంచి పిల్లలు మాట్లాడుతున్న శబ్దం

ఎదురుగా టేబిల్‌పైన అందమైన ఫ్లవర్ వాజ్ పక్కనే టేప్‌రికార్డరు. ఒక్క క్షణం వామనరావు స్తోమతు అంచనా వేసుకొని విస్తుపోయాను పిసినారిగా ఉండే వామనరావు ఇన్ని వస్తువులు కొన్నాడా? ఆశ్చర్యమాశ్చర్యం ఖర్చని వెరవలేదూ?

"కూర్చోండి సార్" సోఫాలో కూర్చోపెట్టాడు

లోపలనుండి ఏడేళ్ళ అబ్బాయి వచ్చాడు

కాటన్ నిక్కరూ, టెరికాటన్ చొక్కా పిల్లాడు ఆపిల్ పండులా ఉన్నాడు

"నమస్తే చెప్పు నాన్నా!"

ఆ కుర్రవాడు నమస్కారం చేశాడు.

"రాజా! మా పెద్దవాడు. లిటిల్ ఫ్లవర్‌లో రెండు చదువుతున్నాడు" "అంకుల్ వచ్చారని చెప్పు అమ్మతో" నవ్వుతూ అన్నాడు రాజాలోనికెళ్ళాడు.

నేనెరిగిన వామనరావు కాడితడు ఎలా మాట్లాడాలో అర్థం కావడం లేదు ఉక్కపోస్తున్నట్లుంది శరీరానికి.

నా అవస్థ గమనించినట్లున్నాడు వామనరావు ఫ్యాన్ ఆన్ చేశాడు

"అలా నిశ్శబ్దంగా ఉండిపోయారేం? మాట్లాడండి సార్!"

ఏమని మాట్లాడను?


నాకు తెలిసిన వామనరావేనా అనిపిస్తోంది

ఇంతలో కర్టెన్ తొలిగించుకొచ్చింది వామనరావు మిసెస్ చేతిలో పకోడీల ప్లేట్లతో

టీపాయ్‌పైన ప్లేట్లు పొందికగా సర్దింది

"ఈయనే సరితా రచయిత గోపాలకృష్ణగారు రోజూ పిలవమని ఫంపేస్తున్నావుగా! మంచి కలివిడి వ్యక్తనుకో" నవ్వుతూ చెప్పాడు.

ఆమె చేతులు జోడించింది. నేను కూడా నమస్కారం చేసాను.



"మా సరితకి పుస్తకాల పిచ్చి ఎక్కువేలేండి. కనబడిన పుస్తకాన్ని వదలదు. సరితా ..బేబీ ఏది?"

"లోపల టిఫెన్ తింటోంది మీరు తీసుకోండి అన్నయ్యగారూ" చెప్పింది

"నా గురించి ఎందుకు మీకు వృధా శ్రమ ? ఇవన్నీ ఎందుకిప్పుడు ?"

"మీ గురించి అనికాదు సార్ ! సాయంత్రాలు ఏదో చేస్తూ ఉంటుంది ఆవిడ. తీసుకోండి" తిండికి ఉపక్రమించాడు వామనరావు.

బోర్న్‌విటా తెచ్చి ఇచ్చింది సరిత.

ఆమె కూడా వచ్చి సంభాషణలో పాల్గొంది. ఆమె కలగొలుపుతనం నన్నెంతగానో ఆకట్టుకొంది.

ఒక రెండు గంటల్లోనే ఆ కుటుంబం ఎంతో దగ్గరయ్యింది నాకు

వామనరావుని అండర్ ఎస్టిమేట్ చేసినందుకు మనసు సిగ్గిల్లింది "వస్తానమ్మా" నిలబడ్డాను

"భోజనానికి ఉండరూ ! ఈ పూట మా ఇంట్లోనే" వామనరావు అభ్యర్థన.

"అవును అన్నయ్యగారూ. మాట్లాడుతూ ఉండండి ఒక్క నిముషం" మరో మాటకి ఛాన్సివ్వకుండా లోనికి వెళ్ళిపోయింది సరిత

ప్రతిసారీ మొహమాటపడ్డం ఎబ్బెట్టుగా ఉంటుందనిపించి వారించలేదు నేనూ, వామనరావు అంతర్జాతీయ రాజకీయాల్లో పడ్డాం

సరిత వచ్చి భోజనానికి పిలిచినంతవరకూ కబుర్లు సాగుతునే ఉన్నాయి.

మార్చుకోడానికి ఇస్త్రీ లుంగీ ఇచ్చాడు వామనరావు.

లోపల బాత్‌రూములో సబ్బూ, తువాలు పెట్టాడు రాజా

ముఖం కడుక్కు వంటింటిలో అడుగు పెట్టాను

చిన్న అల్మైరా, ఫిల్టర్, గ్యాస్ స్టవ్, పాత్రల స్టాండుతో నీట్‌గా ఉంది

రెండు పీటలు వేసి, కంచాలు పెట్టి వడ్డన ప్రారంభించింది

బంగాళదుంపల వేపుడు, వంకాయ పులుసు పచ్చడి, కందిపొడుం, ఆవకాయ, పెసరపచ్చడి.

కొసరి కొసరి గొంతువరకూ ఆప్యాయంగా అమ్మలా తినిపించింది సరిత. తొలిసారిగా చెల్లెలు లేని లోటు తెలిసివచ్చింది

సరిత భోజనం కూడా పూర్తి అయిన తరువాత వెళ్ళొస్తానని బయలుదేరాను "అప్పుడప్పుడూ వస్తూండండి అన్నయ్యగారూ" చెప్పింది సరిత

నన్ను సాగనంపడానికి వెనకనే వామనరావు.

వీధి మలుపు తిరుగుతుంటే కిళ్లీ బడ్డీ కనిపించింది.

డజను అరటిపళ్ళు తీసుకొని వామనరావు కిచ్చాను చెల్లాయి కివ్వమంటూ.

డ్రింక్‌కి ఆర్డరివ్వబోతుంటే వద్దని వారించాడు వామనరావు డబ్బు దండగంటూ

కిళ్లీ ఆఫర్ చెయ్యబోతే తిరస్కరించాడు

మళ్ళా ఆఫీసులో వామనరావే కనిపిస్తున్నాడు నా కళ్లెదుట.

తమాయించుకోలేక అడిగేశాను.


# వివాహ వేదిక

(ప్రకటనదారులకు కొత్త అవకాశం)

రోజురోజుకు సాంఘిక వ్యవస్థ, వివాహ తీరుతెన్నులు మారుతున్నవి. మారుతున్న ధోరణులకనుగుణంగా వివాహ సంబంధాల గూర్చి తగు సమాచారము సేకరించుటలో క్లిష్టత, త్రిప్పట, వ్యయం అధికమవుతున్నవి

వధూవరుల కొరకు సమాచారము పత్రిక ద్వారా అందజేసుకోవడం వల్ల కొంత ఈ సమస్యకు పరిష్కారము కాగలదు ఈ దృష్టితోనే ఆంధ్రపత్రిక (దినపత్రిక)లో వధూవరులను గూర్చిన ఒక ప్రకటనల వేదికను ప్రచురించదలచినాము మామూలుగా అయ్యే చార్జీలపై 50% రాయితీతో అంటే మామూలు సంగ్రహ ప్రకటనలకు లైనుకు రూ.6లు చార్జీకి బదులు ఈ ప్రత్యేక కాలంలో లైనుకు రు 3-00 వంతున చార్జీ వుంటుంది (లైనులో సుమారు 15-16 అక్షరములు ఇమడగలవు) నాలుగు లైన్లకు తక్కువ లేకుండా ప్రకటన వుండాలి.

మీ ప్రకటన విషయము + చార్జీలను మనీ ఆర్డరు/డ్రాఫ్టు ద్వారా జతపరచి (బాక్స్ నెంబరు కోరేవారు అదనంగా రూ.5లు చెల్లించాలి)

**ఆంధ్రపత్రిక**

గాంధీనగరం, విజయవాడ-3

లేదా

బషీర్ బాగ్, హైదరాబాద్-29కు

పంపవచ్చును.




"మీరేమీ అనుకోనంటే ఒక్క మాట వామన రావుగారూ! మీలో ద్వంద్వ ప్రవృత్తి నాకు అర్థం కావడంలేదు. మీరు పిసినారనీ, పైసా కూడా ఖర్చు పెట్టడానికి వెనుకాడతారనీ, ఇంట్లోకూడా హీనంగానే ఉంటారనీ. ఇలా ఎన్నెన్నో అనుకున్నాం మేము ఆఫ్‌కోర్సు నా ఊహలకి సిగ్గుపడుతున్నాననుకోండి. మీ నిజరూపం మీ ఇంటిలో తెలిసిపోయింది. ఖర్చుకు మీరు వెరవరని నాకు అర్థమయ్యింది. కానీ మరి ఆఫీసులో. . ఇదేమిటి?" ఆర్ధోక్తితో ఆగిపోయాను.

భుజంమీద చెయ్యేసి, నిర్మలంగా నవ్వాడు వామనరావు

"మీకు తెలియదా మాష్టారూ! రచయితలు—ఊహించే ఉంటారు నా నోట వినాలని సరదా! ఒక్క క్షణం ఆలోచించండి నేనుకూడా అందరిలాగే ఖర్చులు చేస్తే ఏ పరిస్థితిలో ఉండి ఉందునో ఆలోచించలేరూ? పైన ఎవరేమనుకున్నా నాకు పట్టింపు లేదు. నా భార్యా పిల్లలూ ఎప్పుడూ యిబ్బంది అన్న మాట ఎరగకూడదు నా ఇల్లు చక్కగా ఉండాలి నావాళ్ళు సుఖంగా వుండాలి ఇంట్లో సుఖశాంతులుంటే వృథా ఖర్చు లెందుకు చెయ్యడం చెప్పండి మనం ఖర్చుపెట్టేదేదో ఇంటికిందే పెడితే పోలా?"

నాకు ఒక్కసారిగా కళ్ళు విడినట్లయ్యింది

"అవును. వామనరావు చెప్పింది అక్షరాలా నిజం స్వసుఖం కాదు ప్రధానం. ఇంటిలో వారికి సదుపాయాలు కలగచేయాలి వారి గురించే పాటుపడాలి అందుకోసమే వామనరావు పొదుపు పాటిస్తున్నాడు. ఆ పొదుపు అతనికి మంచి ఫలితాలనే కలుగజేస్తోంది అనుకూలవతి అయిన భార్యా, ఆణిముత్యాల్లాంటి పిల్లలూ, ఇంటినిండా ఫర్నిచరూ . .

హ్యేట్సాఫ్ టూ వామనరావు

నా దృష్టిలో వామనరావు ఉన్నతంగా ఎదిగిపోయాడు

* * *

ఈ కథ ప్రారంభించేటప్పుడు ఈ ముగింపు సరిపోతుందనే అనుకున్నాను.

కథంతా మరోసారి చదివిన తరువాత వామనరావుని నేను సరిగ్గా చిత్రీకరించలేదనే అనిపించింది.

కథలో కేవలం పొదుపు మహత్యమే కనబడుతోందిగానీ వామనరావు విశిష్ట వ్యక్తిత్వం కనిపించడంలేదెక్కడా!

ఈ కథ పత్రికలకు పంపి వామనరావుకి అన్యాయం చెయ్యలేను

ఏ విధమైన ముగింపు ఇచ్చి వామనరావుకి న్యాయం చెయ్యాలా అని ఆలోచిస్తున్న తరుణంలో ఒక నెల మొదటి తారీఖు రోజు—

నెల రోజుల వెట్టిచాకిరీ జీతం అందుకొన్ననాడు మరచిపోతాం.

ఎవరి కుర్చీల్లో వాళ్ళం కూర్చొని జీతాలు లెక్కిస్తున్నాం

యథావిధిగా నా ఎదురు కుర్చీలో సుబ్బారావు లెక్కపెట్టుకుంటూ—

అతనికీ, నాకూ ఈమధ్య టెర్మ్స్ బాగాలేవు.

వామనరావుని అతడు చీటికీ మాటికీ ఏదో అంటూండడం, వామనరావుని వేనకేసుకొని నేను ఖండిస్తూండడంతో మా మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. ఆదిగాక సుబ్బారావు నాకు ఇవ్వవలసిన వందరూపాయలూ అడిగినందున మా మధ్య ముడి మరింతగా బిగుసుకొంది.

జీతం లెక్కపెట్టడం పూర్తిచేసి సుబ్బారావు కేసి ఓరకంట చూసాను.

పెన్ను తీసుకొని కాగితంమీద ఏవేవో అంకెలు వేస్తూ వాడిపోయిన ముఖంతో దిగులుగా ఉన్నాడు మానవుడు.

ఇంతలో సుడిగాలిలా దూసుకొచ్చాడు ఓ ఆజాను బాహువు

గళ్ళచొక్కా, కోరమీసం, ఎరుపుకళ్ళు—ఒకటో రకం లక్షణాలన్నీ ఉన్నాయి గబగబ సుబ్బారావు దగ్గరకిపోయి నిలబడ్డాడు

తడబడుతూ లేచాడు సుబ్బారావు

"ఏమయ్యా పెద్దమనిషీ! నాలుగునెలల నుంచి ముఖం చాటేస్తున్నావ్. ఇదిగో, అదిగో అని రోజులు గడుపుకొస్తున్నావు ఎగెయ్యడానికి మీ అబ్బగాడి సొమ్మనుకున్నావా?" ఉరుము ఉరిమినట్లు అన్నాడు.

అతని భుజమ్మీద చెయ్యేసాడు సుబ్బారావు

"పదండి సార్ ఇక్కడకాదు అలా క్యాంటీన్‌కి పోయి మాట్లాడుకొందాం" నవ్వడానికి విఫలయత్నం చేస్తూ అన్నాడు

"సరి సరిలే పరువుకోసం ఇంకా ఎందుకయ్యా ప్రాకులాట? నీ గురించి పదిమందికీ తెలియొద్దూ! చూడండి సార్ బ్రాకెట్టు ఆడేటప్పుడు, జూదమాడేటప్పుడు మేం గుర్తొస్తాం జీతాలందుకొనేటప్పుడు మా ముఖాలు గుర్తు రావు" నా వంక తిరిగి చెప్తున్నాడు

"ఈ నెల సర్దలేను లింగరాజూ లోన్‌కప్లై చేసాను. వచ్చేనెల నీ సొమ్ము వువ్వుల్లోపెట్టి ఇచ్చేస్తాను. ఈ ఒక్కసారికీ ఊరుకోవయ్యా" చేతులు పట్టుకు బతిమాలుతున్నాడు సుబ్బారావు

"ప్రతినెలా ఇదే మాట చెప్తున్నావ్ మేమిలా ఊరుకొంటే మా వ్యాపారం చెట్టెక్కిపోదూ నెత్తికి చేతులొస్తాయి మాకు. రెండువేల రూపాయలూ పట్టుకెళ్ళేటప్పుడు నవ్వుతూ పట్టుకుపోయావుగా! తీర్చవయ్యా" సుబ్బారావు చొక్కాజేబులోని నోట్లు లాగేసాడు అతను.

"ప్లీజ్ లింగరాజూ. ఈ ఒక్కనెలా నా పరువు కాపాడు. పాలవానికీ, పనిమనిషికీ ఇవ్వాలి. పిల్లాడికి ఫీజు కట్టాలి. ప్లీజ్" చేతులు జోడిస్తూ అన్నాడు సుబ్బారావు.

"దగుల్బాజీ వేషాలెయ్యక అప్పరసెంటర్లో పానిపాపల దగ్గరకెళ్ళేటప్పుడు ఇవన్నీ గుర్తుకు రాలా? ఎన్నాళ్ళు ఊరుకోమంటావు మమ్మల్ని ఇదిగో ఇప్పుడే చెప్తున్నా! ఈ అయిదొందలూ పట్టుకుపోతున్నా. వచ్చేనెలలో పూర్తి సొమ్ము జమకట్టకపోతే మర్యాద దక్కదు" చిల్లర నోట్లని విసిరేసి, విసురుగా వెళ్ళిపోయాడు

జీవచ్ఛవంలా కుర్చీలో కూలబడి, చేతుల్లో ముఖాన్ని దాచుకున్నాడు సుబ్బారావు సుబ్బారావు అసలు రూపం ఇదన్నమాట

పేకాటకీ, బ్రాకెట్లకీ, ముండలకి తగలేస్తూ అప్పులు చేస్తున్నాడన్నమాట.

ఈ లెక్కన ఇంట్లో పెళ్ళాం, పిల్లలకి పస్తులే!

తనలో లోపాలు ఉంచుకొని పరాయివాళ్ళని వెక్కిరించే ఇడియెట్!

మేడిపండు!!

సుబ్బారావు పైన నాకు ఏ మాత్రమూ జాలి కలగడం లేదు.

అటువంటి వారికి కావలసిన శాస్తే ఇది.

సుబ్బారావు బృందం చుట్టు పక్కలెక్కడా కనిపించడం లేదు

బహూశా అప్పుడు గుతాడని కాబోలు ఒక్కొక్కరూ జారుకున్నారు

గోడ గడియారం టిక్ టిక్ మంటోంది

కుర్చీలో కూర్చొని ఫైలు తెరవబోయాను

దగ్గరగా అడుగుల చప్పుడు తల ఎత్తాను

సుబ్బారావు టేబిల్ దగ్గర నిలబడ్డాడు వామనరావు.

సుబ్బారావు ముఖం ఇంకా చేతుల్లోంచి బయటకు రాలేదు

ఇన్నాళ్ళూ సుబ్బారావు తన మీద విసిరిన విసుర్లకి తగిన సమాధానం చెప్తాడా వామనరావు? పొదుపులోని గొప్పతనాన్ని గురించి ఉపన్యసిస్తాడా?

కుతూహలంగా చూస్తున్నాను

చొక్కా జేబులోంచి మూడు పచ్చకాగితాలు తీసి, పేపర్ వెయిట్ క్రింద పెట్టాడు వామనరావు

"చూడండి సుబ్బారావుగారూ! ఎందుకంత దిగాలు పడిపోతున్నారు? మిమ్మల్ని ఆదుకోడానికి మేమంతా లేమూ? ప్లీజ్, బిబోల్డ్ ఈ డబ్బు చెల్లాయికివ్వండి ఆపైన అవసరమైతే చెప్పండి ఇస్తాను. ఆ మార్వాడికి నేను చెప్తాను నెలవారి తీరుద్దురుగాని" భుజమ్మీద తట్టి, తన సీటు వైపు నడిచాడు

ఆ క్షణంలో వామనరావు ముల్లోకాల్నూ ఆక్రమించిన వామనుడిలాగాగే కనబడ్డాడు నాకు అతని ముందు మరుగుజ్జులం మేమందరం

అవును. నిజం?

సుబ్బారావు మెల్లగా నిలబడ్డాడు

కంటినిండా కన్నీళ్ళు

ఒక్కో అడుగు వేసుకుంటూ వామనరావు దగ్గరకెళ్ళాడు

ఒక్కసారిగా అతన్ని కౌగలించుకొని వెక్కివెక్కి ఏడవసాగాడు సుబ్బారావు ★

### చిరునామాలు: మనవి

పత్రికలోపడ్డ రచయితుల చిరునామాలు కావాలని రాయవద్దని మనవి. మీరు వారికి రాసే ఉత్తరాలు కేరాఫ్ ఎడిటర్, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం విజయవాడ—3 అని రాసినట్లయితే—మా కార్యాలయం వాటిని "రీ డైరెక్టు" చేయడానికి ప్రయత్నిస్తుంది. కనుక రిప్లయి కార్డులు రాయవద్దని మనవి

— సం॥